ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
బుధవారం 1 అక్టోబరు 2025





● పెసర్లంకను చుట్టుముట్టిన వరద నీరు

పింఛను పండుగ!

- పంపిణీకి సర్వం సిద్ధం
- దివ్యాంగుల పింఛన్లలో తొలగింపు లేదు



బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముందే.. పింఛన్ల పండగొచ్చింది. జిల్లాలోని పింఛను దారులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు అందజేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి మూడు జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పింఛను నగదు మొత్తాన్ని ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ఖాతాలో జమ చేసింది. మంగళవారం సాయంత్రానికే సచివాలయ సిబ్బంది నగదు డ్రా చేసి.. పంపిణీ సిద్ధంగా ఉంచుకున్నారు. బుధవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు.

● తొలి రోజే 95 శాతం

గుంటూరు జిల్లాలో 2,54,290, పల్నాడు జిల్లాలో 2,73,150, బాపట్ల జిల్లాలో 2,27411 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరందరికీ వలంటీర్లు లేకపోయినప్పటికీ తొలిరోజే పింఛన్లు అందజేస్తున్నారు. మూడు జిల్లాల్లో సచివాలయ సిబ్బంది తొలి రోజునే 95 శాతం పింఛన్లు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుదారులు అందరికీ దసరా ముందురోజే పింఛను నగదు అందనుంది. ప్రతి నెలా ఒకటవ తేదీ పండగ, ఆదివారం, సెలవు దినం ఉంటే ఒక రోజు ముందుగానే పింఛన్ల నగదును ప్రభుత్వం అందజేస్తోంది. గురువారం దసరా పండుగ కావడంతో ముందు రోజు లబ్ధిదారులకు పింఛను నగదు అందనుంది.

● దివ్యాంగులకు యథాతథం

బోగస్ దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,279 మందిని అనర్హులుగా గుర్తించింది. వీరిలో కొంతమంది అర్హులు కూడా అనర్హత బారిన పడడంతో గత నెల ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో వారికి కూడా కిందటి నెల యథాతదంగా పింఛన్లు అందజేశారు. ఈ నెల కూడా వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వారికి కూడా పింఛన్లు అందజేయనున్నారు.

● అందరికీ పింఛన్లు: డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రతి లబ్ధిదారునికి ఒకటో తేదీనే పింఛన్‌ను అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఆ రోజు ఎవరైనా అందుకోలేని పక్షంలో ఆందోళన పడాల్సిన పనిలేదు. వారికి మూడో తేదీ నుంచి యథావిధిగా పింఛన్లు అందజేస్తాం. దివ్యాంగుల పింఛన్లలో ఎలాంటి తొలగింపు లేదు. వారికి కూడా ఈనెల పింఛన్లు అందజేస్తున్నాం.

వీడని ముంపు

- జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు
- ఒక అడుగు వెనక్కు... రెండడుగులు ముందుకు
- వరద తగ్గినట్టే తగ్గి ఇంతలోనే పెరుగుతూ
- చాలా లంకలకు రాకపోకలు లేవ్
- అత్యవసర సేవల కోసం పడవలు ఏర్పాటు
- వాణిజ్య పంటలు, రొయ్యల చెరువులకు తీరని నష్టం



కొల్లూరు వరద నీటిలో ఉన్న ఇటుక బట్టీలు



వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట



అరవింద వారధి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



వరదనీటిలో మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం



● సుగ్గునలంక చప్టాపై వరద ప్రవాహం

మూడు రోజులుగా చుట్టుముట్టిన వరద ఒక అడుగు వెనక్కు వెళితే, ఇంతలోనే రెండడుగులు ముందుకు చొచ్చుకొస్తోంది. తగ్గిందని ఊపిరి పీల్చుకునేలోపే మళ్లీ వరద పెరిగిపోతోంది. లంక గ్రామాలపై ఉగ్రరూపం చూపిన కృష్ణమ్మ శాంతించటంలేదు. దీంతో కృష్ణా తీరంలోని గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. రోడ్లపైకి కూడా వరద నీరు చేరటంతో రాకపోకలకు ఇంకా ఆటంకాలు తప్పటంలేదు. దీంతో ఏ గ్రామంలోనివారు ఆ గ్రామంలోనే చిక్కుకుపోయారు. అధికారులు సురక్షిత ప్రాంతాలకు రావాలని పలుమార్లు హెచ్చరికలు చేసినా పశువులను వదిలి బయటకు రావటానికి ఎవరూ ఇష్టపడటంలేదు. అయితే కొన్ని గ్రామాల్లో పరిస్థితి విషమించే వాతావరణం ఉండటంతో ఆ గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి, 500 మందివరకు రెండు గ్రామాలనుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



వరదనీటిలోనే అమ్మవారికి పూజలు

- వివరాలు 4లో



● పెనుమూడి వద్ద వరదను పరిశీలిస్తున్న మంత్రి అనగాని



● పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



వరదనీటిలోనే పెనుమూడి పల్లెపాలెం

గుంతల రోడ్డుకి మోక్షం

గుంతల రోడ్డుకి మరమ్మతులు చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'అధ్వానపు రహదారితో ప్రజల అవస్థలు' అన్న కథనానికి అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్డుకు కంకర తోలించి.. సమస్య తీర్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో .. ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న ఈ రోడ్డు గోతులమయంగా మారింది. ఓ పక్క గుంతలు, మరోవైపు వర్షపు నీరు చేరి అస్తవ్యస్తంగా మారింది.

-పర్చూరు,(ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంతలు మయం అయిన రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం



వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

- అక్రమాలను నిగ్గుతేల్చేందుకు చర్యలు
- విచారణాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఢిల్లీరావు
- త్వరగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు
- ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ చరిత్రలో తొలిసారి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సీనియర్ ఐఏఎస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావును విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం విడుదలైన ఈ ఉత్తర్వుల్లో విచారణ త్వరగా ముగించి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్, కర్నూలు జిల్లాకు చెందిన అడ్వకేట్.. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మిపై చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనుంది. ఇన్‌చార్జి వీసీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, బెదిరింపుల అంశాలపై విచారణ జరిపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మసక బారిన ప్రతిష్ట

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, రాజకీయాల వల్ల ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్ట క్రమేపీ మసక బారుతోంది. విశ్వ విద్యాలయం చరిత్రలో ఏనాడూ ఇలా సీనియర్ ఐఏఎస్‌తో విచారణ జరిగిన సందర్భం లేదు. మొట్ట మొదటి సారి భారీ విచారణకు ప్రభుత్వం ఉపక్రమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య (మిగతా 4వ పేజీలో)

చట్టానికి పాతర..

యూనివర్సిటీ చట్టంలో ఫైనాన్స్ కమిటీ (ఆర్థిక కమిటీ) లేకుండా నిధులు డ్రా చేయకూడదని స్పష్టంగా ఉంది. యూనివర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే రూ.వందల కోట్ల నిధుల వినియోగం అంతా కూడా ఫైనాన్స్ కమిటీ కనుసన్నల్లోనే జరగాలి. గడచిన రెండేళ్ల నుంచి అలాంటి కమిటీ లేకుండానే నిధులు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు ఇంత వరకు ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు చేయక పోవడంపైనే చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనివర్సిటీ చట్టం ప్రకారం ఖచ్చితంగా ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలక మండలి సమావేశం నిర్వహించాలి. కానీ ఐదుగురు సభ్యులతోనే మమ అనిపించారు.

ఫ్యాక్టరీ భూములపై ప్రైవేట్ కన్ను..?

- భూమి కొనుగోలుకు ఓ మహిళ దరఖాస్తు
- నామమాత్రపు ధరకు ఇవ్వాలని వినతి
- చట్ట వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోమని సీఎస్ సమాధానం

వేమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 77 ఎకరాల భూమిపై ప్రైవేట్ వ్యక్తుల కన్ను పడింది. 47 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు ఇవ్వాలంటూ ఓ మహిళ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్‌లో మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన తెన్నేటి రమ్య.. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి ఇవ్వాలని బాపట్ల కలెక్టర్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాసింది. 500 మందికి జీవనోపాధి కల్పిస్తానని అందుకోసం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో సర్వే నంబరు 197/2 నుంచి 217 వరకు ఉన్న 42 ఎకరాల భూమిని కేటాయించాలని కోరింది. ఈ వివరాలు బయటకు రావడంతో రైతులు, ఉద్యోగులు, స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులకు రూ.11 కోట్లు, రైతులకు రూ.12 కోట్లు, అప్పులు రూ.150 కోట్లు.. రైతులకు చెల్లించాల్సిన నాన్ రిఫండబుల్ డిపాజిట్లు బకాయి చెల్లించకుండానే భూములను చట్టానికి వ్యతిరేకంగా ఎలా అమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఈ బకాయి చెల్లింపు విధానం అమలు చేసేందుకే ప్రభుత్వం లిక్విడేటర్‌ను నియమించడం జరిగింది. భూమి అమ్మి అప్పులు తీరే పరిస్థితి కనపడని కారణంగా బ్యాంకులతో చర్చించిన వన్ టైం సెటిల్‌మెంట్ విధానంలో బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్వయంగా న్యాయాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ తరుణంలో సదరు మహిళ ప్రభుత్వానికి లేఖ రాస్తూ.. కొంత భూమిని నామమాత్రపు ధరకు తనకు విక్రయించాలని కోరడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ లేఖపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ.. చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోమని సమాధానమిచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మహిళ కోరిక మేరకు ప్రభుత్వం అనుకూలంగా స్పందిస్తే ప్రజా వ్యతిరేక ఉద్యమం కొనసాగే అవకాశాలు ఉన్నాయి.



మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ

రైతు పక్షంగా ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాత్రం రైతు పక్షంగానే ఫ్యాక్టరీ స్థలంలో వ్యవసాయ ఆధారితమైన కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రతి సమావేశంలోనూ ఆయన ప్రజల సమక్షంలో బాహాటంగా ప్రకటిస్తున్నారు. అనేక మంది పెద్దలు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఎమ్మెల్యే మాత్రం రైతు పక్షపాతిగానే వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రితో చర్చించి ఎలాగైనా ఫ్యాక్టరీ స్థలంలో రైతులకు సంబంధించిన కర్మగారాన్నే ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్నారు. ఇందుకు రైతులు, ప్రజలు, ఉద్యోగులు కూడా తమ సంఘీభావాన్ని తెలుపుతున్నారు.

శిక్షణ కేంద్రాలు ఇవే..

- నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజి, బూరనపేట ప్రగతి భవన్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.
- వినుకొండ సమీపంలోని వివేకానంద బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ (ఉర్దూ, ఇంగ్లిష్), ఫిజిక్స్, గణితం అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు.
- నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజ్ వైశ్య భవన్‌లో(రావిపాడు రోడ్డు) సెకండరీ గ్రేడ్ టీచర్స్ (తెలుగు, ఉర్దూ మీడియం) అభ్యర్థులకు శిక్షణ తరగతులుంటాయి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ అభ్యర్థులకు గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాల (సాంబశివపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు)లో శిక్షణ ఇస్తారు.
- సెకండరీ గ్రేడ్ టీచర్లకు నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురు (పాత ఎన్‌బీటీ ఎన్.టి.ఆర్ కాలేజ్) శిక్షణ అందిస్తారు.

కొత్త ఉపాధ్యాయులకు..

ఐదు చోట్ల శిక్షణ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఐదు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జోన్-3 పరిధిలో 1,600 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలలో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

తరగతులు ఇలా..

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అధ్యాపకులను సిద్ధం చేశారు. తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం విద్యాబోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధివిధానాలు, చట్టాలు, పిల్లలతో

శిక్షణ అంశాలను విడుదల చేసిన విద్యాశాఖ

బాధ్యతాయుత ప్రవర్తన, కేంద్ర, రాష్ట్ర విద్యా విధానాలు, విద్యాభివృద్ధి పథకాలు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం, సృజనాత్మకత ఆకలింపు, విద్యాబోధనలో సాంకేతికత తదితర అంశాల్లో నూతన ఉపాధ్యాయుల శిక్షణ ఇస్తారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగానికి ఎంపికైన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాల్సిందేనని, ఎవరికి ఇందులో మినహాయింపు లేదని డీఈఓ. సీవీ రేణుక స్పష్టం చేశారు.



మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

వరి పొట్టు నుంచి బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు



బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ ఉత్పత్తుల తయారీ అంగీకార పత్రాలను ఎమ్మెల్యే నరేంద్ర నుంచి అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ తయారీ జరగటం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. వరి పొట్టు నుంచి బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ తయారీ ఒప్పంద పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా సంస్థ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను తయారు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. మున్నిపల్లె గ్రామంలోని రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్ కొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వడ్లగింజల పొట్టును ఉపయోగించి బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్, ఒకసారి వాడే ప్లేట్లు, బౌల్స్ టీ కప్పులు, చంచాల తయారీకి రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతికత బదిలీ కోసం రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్, కాకాని అగ్రి వేర్ సంస్థలు సీఎస్ఐఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లీనరీ సైన్స్ అండ్ టెక్నాలజీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. నరసరావుపేటలోని అగ్రి వేర్ సంస్థ ఇప్పటికే బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు చెప్పారు. రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్ త్వరలోనే ఈ ఉత్పత్తిని ప్రారంభించబోతున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు వినూత్న ఆలోచనలు చేసిన గుదేటి బాలకృష్ణారెడ్డి, కొల్లా సాంబశివరావును ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ట్రూడౌన్‌తో వినియోగదారులకు ఊరట

- ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల తగ్గింపు (ట్రూడౌన్)తో వినియోగదారులకు ఊరట కలుగుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచారని, వాడుకున్న విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులకు షాక్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తుంటే జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీల తగ్గింపుతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు రూ.923.55 కోట్ల లబ్ధి చేకూరనుందని చెప్పారు. కాగా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పలువార్డులలో వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు. పింఛన్ల పంపిణీ అనంతరం జీఎస్టీ తగ్గింపుపై కలిగే ప్రయోజనాల సమావేశంలో యరపతినేని పాల్గొననున్నట్లు చెప్పారు.

ట్రూడౌన్‌తో నూతన చరిత్ర: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల తగ్గింపు (ట్రూడౌన్) నూతన చరిత్ర అని, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనా విధానాలతోనే ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించి మొత్తం రూ.923.55 కోట్లు ప్రజలకే అందివ్వడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. ట్రూఅప్‌లకే పరిమితమైన గత పాలకుల చర్యలతో విద్యుత్ భారంతో అల్లాడిపోయిన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ట్రూడౌన్‌ను పరిచయం చేయడం హర్షణీయమని అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో పాటు 50 గజాల్లో నిర్మించే ఇంటి అనుమతి ఫీజును కేవలం ఒక రూపాయిగా నిర్ణయించడం మరో విశేషమని చెప్పారు. దీని వల్ల ఖజానాకు జమయ్యే రూ.4వేల కోట్లను కూడా కాదనుకొని ప్రభుత్వం ప్రజల సంతోషానికే ప్రాధాన్యమిచ్చిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

వీడని ముంపు

● జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు



అరవింద వారధి ఎగువున ఉధృతంగా వరద ప్రవాహం

తెనాలి, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లిపర, రేపల్లె, సెప్టెంబరు 30, (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద కారణంగా గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని లంక గ్రామాలకు దారులు మూసుకు పోయాయి. అత్యవసర సాయం కోసం పడవలను ఏర్పాటు చేశారు. సముద్ర తీర గ్రామాల్లో రొయ్యల చెరువులకు ఊహించని దెబ్బతగిలితే, కృష్ణా తీరంలోని గ్రామాల్లో వాణిజ్య పంటలకు నష్టం తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ముంపులోనే అరటి, పసుపు, కంద, తమలపాకు వంటి పటలు ఉన్నాయి. కూరగాయలు, పూల తోటలు మాత్రం పనికిరాకుండా పోయాయి.

తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతూ...

కృష్ణా నదికి వస్తున్న వరద తగ్గినట్టే తగ్గి, ఇంతలోనే పెరిగిపోతోంది. సోమవారం రాత్రి 6,39,737 క్యూసెక్కులకు వరద తగ్గితే, మంగళవారం సాయంత్రానికి 6,53,828 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రికి ప్రకాశం బ్యారేజి దగ్గర నీటి మట్టం మళ్లీ 16.1 అడుగులకు చేరింది.

జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు

గుంటూరు జిల్లా కొల్లిపర మండలం కొత్తూరు లంక, అన్నవరపులంక, కృష్ణా జిల్లాకు చెందిన మరి కొన్ని లంకలు నేటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర ఆరోగ్య సేవలు కోసం మాత్రమే పడవలను సిద్ధంచేశారు. బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని లంక గ్రామాలకే తీరని నష్టం ఏర్పడింది. దోనేపూడి, వెల్లటూరు దగ్గర చిన్న రేవులోకి నీరు రావడంతో రాకపోకలు ఆపేశారు. దోనేపూడి దగ్గర పడవను ఏర్పాటు చేస్తే, వెల్లటూరు దగ్గర మాత్రం ద్విచక్ర వాహనాలను కూడా వెళ్లనివ్వకుండా ఆపేస్తున్నారు. కేవలం ట్రాక్టర్‌లపైనే నీటిని దాటేందుకు అవకాశం కల్పిస్తున్నారు. భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక, పెదలంక, చింతమోటు, కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, కిష్కింధపాలెం, గుంటూరుగూడెం, తిప్పలకట్ట, పోతార్లంక, మరికొన్ని గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మరోపక్క ఓలేరు పల్లెపాలెం, పెనుమూడి దగ్గర మాత్రం కరకట్టకు, నదికి మధ్యనున్న ఈ రెండు గ్రామాల్లోకి నీరు రావడంతో ఖాళీ చేయించారు. ఈ రెండు గ్రామాల నుంచి 500 మంది కిపైగా జనాన్ని పెనుమూడి, ఓలేరు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు.



రేపల్లె : ఓలేరు పల్లెపాలెం సమీపంలో వరద నీటిలో నానుతున్న అరటి మొక్కలు

రైతుల ఆశలు ఆవిరి

సముద్ర తీరంలోని భట్టిప్రోలు మండలం ఓలేరు, రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, లక్ష్మీపురం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ గ్రామాల్లో సుమారు 800 ఎకరాల చెరువలను వరద నీరు ముంచేసింది. 20 రోజుల్లో చేతికొచ్చే స్థితిలో ఉన్న రొయ్యలు నదిలో కలిసిపోయాయి. మొత్తంమీద రూ. 25 కోట్ల వరకు నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు.

మంత్రి అనగాని పరిశీలన

వరద బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి అనగాని భరోసాను ఇచ్చారు. మంగళవారం రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానది వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. కరకట్ట పటిష్టతపై అధికారులను ఆరా తీశారు. కరకట్టకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన పైపు లేన్ల గురించి ఆర్సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ మంత్రికి వివరించారు. తక్షణమే పైప్‌లైన్‌లను తొలగించాలని.. ఎవరి సిఫార్సుచేసిన వినవద్దని స్పష్టం చేశారు. కరకట్ట పటిష్టతకు రూ.300కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. వరద ఉధృతి ఇంకో ఐదురోజుల పాటు ఉంటుందని, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఆనందబాబు

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వరద తగ్గిన వెంటనే పంట నష్టం సర్వే నిర్వహించి పరిహారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు వరద ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని ప్రజలకు భరోసా కల్పించారు.

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద నీరు

● దిగువకు 6,53,828 క్యూసెక్కులు విడుదల ● కొనసాగుతోన్న రెండో ప్రమాద హెచ్చరిక



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి బ్యారేజికి 6,69,188 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోద యినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 16.1 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 6,53,828 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,334 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో దిగువ నది తీర ప్రాంతవాసులు, లంక భూముల రైతులు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు భారీగా వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 584.10 అడుగులుగా ఉంది. ఇది 294.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,533 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,401 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,251 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 5,31,534 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, మొత్తం 5,81,919 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 5,61,884 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

(3వ పేజీ తరువాయి)

విడుదలైన జాతీయస్థాయి విశ్వ విద్యాలయాల ర్యాంకుల్లో కూడా ఎన్జీ రంగా యూనివర్సిటీ అట్టడుగు స్థాయికి చేరింది. లబ్ద ప్రతిష్ఠులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు యూనివర్సిటీలో చాలా మంది ఉన్నప్పటికీ పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ముందరి కాళ్లకు బంధనాలువేస్తున్న పరిస్థితి అక్కడ నెలకొన్నట్లు తెలుస్తోంది.

చెల్లని నిర్ణయాలు

వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ పొందిన కొందరు శాస్త్రవేత్తలు ఈ మధ్య కాలం లో సీఎంఓలో ఒక ఫిర్యాదు అందజేశారు. కోరం లేకుండా తీసుకున్న ప్రతి నిర్ణయం చట్ట విరుద్ధమని, వాటి పై సమీక్ష నిర్వహించాలని అందులో కోరారు. ఐదుగురు సభ్యులతో మాత్రమే నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు, రూ.1.25 కోట్లతో కార్ల కొనుగోలు వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. అవి చెల్లుబాటు కావన్నది విశ్రాంత శాస్త్రవేత్తల వాదన.

పాలక మండలి సభ్యులు ఉన్నా..

గత ప్రభుత్వం వ్యవసాయ విశ్వ విద్యాలయానికి పాలక వర్గం నియమించింది. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామా చేశారు. ముగ్గురు మాత్రం ఈ రోజుకీ రాజీనామా చేయలేదు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేస్తే.. రిజిస్ట్రార్ వారికి తగిన సమాచారం ఇవ్వాలి. కానీ ఒక్క సమావేశానికి కూడా వారికి ఆహ్వానం పంపలేదని తెలుస్తోంది.

చెస్‌తో స్వీయ పరిశీలనా శక్తి పెంపు

● ఎమ్మెల్యే డాక్టర్ కామినేని ● నేటితో ముగియనున్న చెస్ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

గుంటూరు విద్య సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చదరంగం ద్వారా స్వీయ పరిశీలనా శక్తి పెరుగుతుందని, స్వీయ అభివృద్ధికి ఈ ఆట దోహదం చేస్తుందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మంగళవారం కామినేని పోటీలను పరిశీలించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, చదరంగం ఆడటం వల్ల మెదడు పదునెక్కుతుందని, సమస్యల పరిష్కారానికి తక్షణ నిర్ణయాలు తీసుకునే శక్తి పెరుగుతుం దని అన్నారు. ముందుగానే ప్రత్యర్థి ఆలోచనలను అంచనా వేసే గుణంతో పాటు అనుకోని పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండే లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. 'ఒక కదలికకు పది ఫలితాలు' అనే దృక్పథాన్ని చెస్ నేర్పుతుందని కామినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు లంకా రవి, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో భర్త హత్య

● రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య యత్నం
● కేసును ఛేదించిన మేడికొండూరు పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన మేడికొండూరు సీఐ నాగూర్ మీరా

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులో ఓ మహిళ తన భర్తను హత్య చేయించింది. ఆస్తి కోసం ఈ దారుణానికి ఒడి గట్టింది. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించింది. అయితే మేడికొండూరు పోలీసులు చాకచక్యంగా కేసును ఛేదించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి కేసు వివరాలు వెల్లడిం చారు. హతుడు చెన్నంశెట్టి గోవిందరాజుకు లక్ష్మితో సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహమయింది. ఆటో డ్రైవర్‌గా పనిచేసే గోవిందరాజు మద్యానికి బానిసయ్యాడు. గోవిందరాజు నిత్యం మద్యం తాగి వేధిస్తుండడంతో లక్ష్మి ఆరేళ్ల నుంచి విడిగా సత్తెనపల్లిలో ఉంటూ క్యాటరింగ్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో ఆమెకు పేర్నేపాటి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్‌తో పరిచయం ఏర్పడింది. మూడేళ్ళ నుంచి వీరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. అయితే లక్ష్మికి తన అత్తమామల నుంచి ఆస్తి రావాల్సి ఉంది. అయితే తన భర్త గోవిందరాజు దాన్ని తనకు దక్కనీయడని అతన్ని చంపితే ఆస్తిని దక్కించుకోవచ్చని లక్ష్మి తన ప్రియుడు వెంకట్‌తో కలిసి పథకం వే సింది. అందుకు అంగీకరించిన వెంకట్ తన స్నేహితుడైన షేక్ ఖాసిం సైదా అలి యాస్ అండాతో కలిసి ఈ నెల 18న ఆటోలో గోవిందరాజు ఇంటికి వెళ్ళారు. వెంకటేశ్వర్లుకు గోవింరాజుతో పరిచయం ఉండటంతో మ ద్యం తాగుదామని చెప్పి అతన్ని ఆటోలో ఎక్కించుకొని సా తులూరు పెదరెడ్డిపాలెం గ్రామాల మధ్యలో గల సాగర్ కాలువ వద్దకు వెళ్లా డు. అక్కడ మద్యం తాగుతూ గోవిందరాజుతో గొడవ పెట్టుకున్నారు. అతన్ని కొట్టి, మొల తాడును గొంతుకు బిగించి లాగడంతో స్పృహతప్పి పడిపోయాడు. అటువైపు ఎవరో వస్తున్నట్టు అలికిడి విని గోవిందరాజును సత్తెనపల్లి మండలంలోని అబ్బూరు గ్రామ శివారులోకి తీసుకెళ్లి మెడను ఆటో రాడ్‌కు ఆనించి గట్టిగా అదమడంతో గోవిందరాజు రక్తం కక్కి, నాలుక కొంచం బయటకు పెట్టి చనిపోయాడు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు గోవిందరాజు మృతదేహాన్ని పెద్ద పలకలూరు రోడ్డుపై పడేశారు. అయితే మృతుడి నాలుక బయటకు ఉండడంతో మేడికొండూరు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా వారికి అనుమానాస్పద రీతిలో ఓ ఆటో కనిపించింది. దాని యజమానిని ప్రశ్నించగా ఆటోను కొద్దిరోజుల సత్తెనపల్లికి చెందిన పేర్నేపాటి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ అమ్మినట్లు చెప్పాడు. దీంతో పోలీసులు ముగ్గురు నిందితు లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. కేసు ఛేదించిన మేడికొండూరు ఎస్సై నాగూర్ మీరా సాహెబ్‌ను, ఎస్సైలు ఖాజీ బాబు, సుబ్బారావు, కానిస్టేబుళ్ళు జాన్ సైదా, సురేష్, నాగేశ్వరరావు, బాజీ సాహెబ్, .లక్ష్మి దేవిలను ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందించారు.

ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు

● చౌడవరం గ్రామ శివారు క్వారీలో ఘటన



షేక్ మాబు (ఫైల్‌ఫోటో)

యడ్లపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మం డలం కొండవీడు రిజర్వు ఫారెస్టు చౌడవరం గ్రామ శివారులోని క్వారీ గుంతలో ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతయ్యాడు. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం గ్రామానికి చెందిన షేక్ మాబు (15) యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం అతడు తన స్నేహితులతో కలిసి చౌడవరం శివారు క్వారీ గుంతలో ఈత కొట్టేందుకు వెళ్లా డు. నీటిలోతు తెలియక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. అతనిని కాపాడేందుకు స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వారు వెంటనే ఒడ్డుకు చేరుకొని స్థానికులకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గల్లంతైన విద్యార్థి కోసం గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు.

గల్లంతైన విద్యార్థుల కోసం కొనసాగుతున్న గాలింపు

నకరికల్లు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం గుండ్లపల్లి నాగార్జున సాగర్ కుడి కాలువలో సోమవారం గల్లంతైన చిలకలూరిపేటకు చెందిన షేక్ హర్షద్, ఈపూరివారిపాలెంకు చెందిన మార్క్ రోఫర్‌ల కోసం మంగళవారం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద, చేజర్ల హెడ్ రెగ్యులేటర్ వద్ద, ఆరేపల్లి ముప్పాళ్ళ మినీ హైడల్ పవర్ ప్లాంట్ వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు గల్లంతైన విద్యార్థుల ఆచూకీ లభించలేదు.

బాపట్ల, తెనాలి ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు

● 3 వేల ఎంటీల లోడింగ్ లక్ష్యంగా స్పెషల్ రైల్వే ప్రాజెక్టు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాపట్ల, తెనాలి ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపునకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. మూడు వేల ఎంటీల లోడింగ్ లక్ష్యంగా ఈ స్పెషల్ రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగనున్నాయి. ముఖ్యంగా గూడ్స్ రైళ్లు ఎక్కువగా రాకపోకలు సాగించే తెనాలి, బాపట్ల రైల్వేస్టేషన్ల వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచుతారు. ఇందుకోసం భూసేకరణ అవసరం కావడంతో రైల్వేశాఖ స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ పనుల వల్ల ట్రాన్స్‌మిషన్ నష్టాలు వంటివి చాలావరకు తగ్గిపోతాయి. గుంటూరు-తెనాలి సెక్షన్‌లోనూ ఈ తరహా పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సోమయ్య


చాప సోమయ్య

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీనియర్ టీడీపీ నాయకులు చాప సోమయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండు కార్పొరేషన్‌లకు డైరెక్టర్లుగా బాపట్ల నాయకులను నియమించారు. మరోసారి సీనియర్ నాయకుడు చాప సోమయ్యకు డైరెక్టర్ పదవి లభించటంతో బాపట్లకు మూడు కార్పొరేషన్‌లకు ముగ్గురు డైరెక్టర్లను నియమించారు. ఈ విధంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు సోమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నేత మాధవ్‌ను కలిసిన యువమోర్చా కోశాధికారి


బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న యువమోర్చా కోశాధికారి బొడ్డు కృష్ణ చైతన్య

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మంగళవారం యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బొడ్డు కృష్ణచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి సత్కరించి పార్టీ బలోపేతానికి యువమోర్చా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు గురించి వివరించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

● జనసేన నాయకుడు విన్నకోట


చింతాయపాలెంలో అన్నసంతర్పణలో వడ్డిస్తున్న విన్నకోట సురేష్, గుంటుపల్లి తులసీకుమారి

కర్లపాలెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెంలో నిర్వహిస్తున్న శ్రీదేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం జనసేననాయకుడు, ఆఖండఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పుసత్రం చైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి, కర్లపాలెం మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల నాయకులు దాసరి ఏసుబాబు, కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, చిలకల సురేంద్ర, కంచర్లపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన ప్రశాంత్ అనే యువకుడు వారం రోజుల క్రితం పనికెళుతున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి రాకపోవటంతో చుట్టుపక్కల విచారించి తల్లి కిషోర్ రాణి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు


గోశాలకు తరలించిన ఆవులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :పట్టణ పరిసరప్రాంతాలలో పెద్దఎత్తున సంచరిస్తున్న ఆవుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను గుర్తించి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వాటిని రైలుపేటలోని హిందుస్మశానవాటికలో ఏర్పాటు చేసిన గోశాలకు తరలించారు. ప్రమాదాలకు కారణం అవ్వటమేకాకుండా వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తూ పారిశుద్యం అధ్వానం చేస్తున్నాయని కమిషనర్ తెలిపారు. దీనిపై మైక్‌లతో ప్రచారం, కరపత్రాల ద్వారా వివరించినప్పటికి సంబంధిత యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల వీటిని గోశాలకు తరలించామన్నారు. ఆవుల యజమానులు వచ్చి శానిటరి సిబ్బందికి చలానా చెల్లించి ఆవులు తీసుకెళ్ళాలని తెలియజేశారు. 5 రోజుల్లో ఆవులు తీసుకెళ్ళకపోతే శ్రీశైల గోఆశ్రమంకు తరలిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● వరద తగ్గిన వెంటనే పంట నష్టం అంచనాలు
● ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, భట్టిప్రోలు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా కృష్ణానది వరదలతో లంక గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. పెదలంక వద్ద నీట మునిగిన పసుపు, అరటి, కంద తదితర పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వరద వల్ల జరుగుతున్న నష్టాల గురించి తెలుసుకున్నారు. వరద తగ్గిన వెంటనే పంట నష్టం అంచనాలు సర్వే నిర్వహించి పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అధికారులను కూడా సర్వే బృందాలను ఏర్పాటు చేసి పంటలు మునిగిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నష్టం అంచనాలు వేయాలన్నారు. ప్రభుత్వం రైతులను ఆర్థికంగా నిలబెట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పడవల ద్వారా మంచినీరు అందించడంతో పాటు వరదల వల్ల నెల రోజుల


చప్టా వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పాటు లంక గ్రామాల్లో పనులు ఉండవని, వారికి ఏడు రకాల నిత్యావసర సరుకులు అందించాలని అధికారులకు సూచించారు. సుగ్గునలంక చప్టా వద్ద భారీ వరద నీరు ప్రవహిస్తుండటంతో అక్కడి నుండి ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో డ్రోన్ సహాయంతో పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పార్టీ నాయకులు సుంకర రాంబాబు, కోగంటి శివవెంకటేశ్వరరావు, శిగిలిశెట్టి రాఘవరావు, సుంకర రాంబాబు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, జీఎల్‌జీ భగవాన్, వెనిగళ్ల మహేష్, మేకా దివాకర్, కొల్లూరు నాగశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

వరద ప్రభావిత గ్రామాల్లోని ప్రజలకు ఏడు రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. మంగళవారం కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మండల స్థాయి అధికారులతో వరదపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పశుగ్రాసం ముంపుబారిన పడటం వలన పశు వైద్య శాఖ దాణా తదితర వాటిని అందించాలని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.


శ్రీదుర్గాదేవిగా దర్శనమిస్తున్న జిల్లెళ్ళమూడి అమ్మవారు


చందోలులో శ్రీదుర్గాదేవీ అలంకరణలో పార్వతీ దేవి అమ్మవారు


సమ్మెటవారిపాలెంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


కొత్తనందాయపాలెంలో దుర్గాదేవి అలంకరణ


బాపట్ల పట్టణం సూర్యలంక రోడ్డులో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు

విజయాలు చేకూర్చే దుర్గామాత పాహిమాం..

● దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం
● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

బాపట్లరూరల్: బాపట్లమండలం నాగేంద్రపురంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లెళ్ళమూడి అమ్మవారికి స్వర్ణ కిరీటధారణ జరిగినది. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.

● పిట్టలవానిపాలెం మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ ఈవో తెలిపారు.

● మండలంలోని అల్లూరులో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించారు.

● ఖాజీపాలెంలో శ్రీకాశీవిశ్వనాధస్వామి దేవస్థానంలో శ్రీ దుర్గాదేవిగా అలంకరణలో శ్రీఅన్నపూర్ణాదేవి పూజలు అందుకుంది.

● చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో శ్రీపార్వతీ అమ్మవారు శ్రీదుర్గాదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల


శ్రీ దుర్గాదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు

సందర్భంగా వేదాంతం కృష్ణమచార్యులు ఆధ్వర్యంలో శ్రీరాజ్య లక్ష్మీ అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు.

● మంతెనవారిపాలెంలో శ్రీగంగాపర్వతవర్ధిని


పోతుమర్రులో దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

సమేత శ్రీరామలింగేశ్వరదేవస్థానంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులతో పూజలు అందుకున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

కర్లపాలెం: మండలంలోని 20 పంచాయతీలలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మంగళవారం వందలాది మంది భక్తులు ఆయా ఆలయాల్లో కన్నుల పండువగా జరుపుకున్నారు.

● వేమూరు: దుర్గాదేవిని దసరా ఉత్సవాల్లో పూజిస్తే విజయం చేకూరుతుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండలంలోని పోతుమర్రు గ్రామంలో దుర్గాదేవి భక్తసమాజం వారు నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు జరిపారు. అన్నదానం కార్యక్రమాన్ని ఆనందబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, గొట్టిపాటి పూర్ణకుమారి, ఉసా రాజేష్, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

● మండలపరిధిలోని శివాలయాల్లో పార్వతీ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

● కొల్లూరు, భట్టిప్రోలు : కోటిపల్లిలోని సోమశేఖరస్వామి దేవస్థానంలో సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు, అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారి దేవస్థానంలో మహాదుర్గాదేవి అలంకారంలో, భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు కనకదుర్గాదేవిగా, పార్వతీ అమ్మవారు సిద్ధిదాత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కోటిపల్లిలో దుర్గాదేవి అలంకారంలో సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు


భట్టిప్రోలులో కనకదుర్గ అలంకారంలో వాసవీ అమ్మవారు


చావలి వాలేశ్వరాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు

విజయదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

రేపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇసుకపల్లిలోని వేపాళమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు పెద్ద


వేపాళమ్మ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్నమహిళలు


చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో..


శ్రీగంగాంబికాసమేత స్వామి ఆలయంలో..

సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం, ఆంజనేయస్వామిదేవాలయం, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, రామకోటి శివాయలంలో దుర్గాష్టమిపూజలు ఘనంగా నిర్వహించారు.

వైద్య కళాశాలల నిర్మాణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున


నల్లరిబ్బన్‌లు, కండువాలు ధరించి నిరసన ర్యాలీ చేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున తదితర నాయకులు

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల నిర్మాణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. వైసీపీ ఎస్సీసెల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. రథంబజారులోని వైసీపీ కార్యాలయం నుంచి నల్లరిబ్బన్‌లు, కండువాలు ధరించి నినాదాలు చేస్తూ ప్రదర్శనగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్మించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలగడ్డ చెంచయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమల్ల వాసు, పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, ఎస్సీసెల్ నాయకులు డేవిడ్, ప్రకాష్, రాజా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్ఐ ఆర్థిక సాయం


వరద బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్ఐ అమరవర్ధన్

కొల్లూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు ఎస్ఐ అమరవర్ధన్ తన వంతు ఆర్థిక సాయం మంగళవారం అందించారు. కొల్లూరు కరకట్ట దిగువన నివాసం ఉంటున్న మూడు ఎస్టీ కుటుంబాల గృహాల్లోకి వరద నీరు వెళ్లడంతో ఇంట్లోని వస్తువులన్ని కొట్టుకుపోయాయి. ఆయా కుటుంబాలను కొల్లూరులోని బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.15 వేలు ఎస్ఐ అందజేశారు. ఆయన వెంట నగరం తహసీల్దార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్లో ఎడ్యుకేషనల్ ఇంటర్న్‌షిప్


విద్యార్థులకు మోటారు బైక్ మెకానిజం గురించి వివరిస్తున్న షోరూం సిబ్బంది

బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల కోసం దసరా సెలవులు సందర్భంగా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని బి.రాజశ్రీ, ఎలక్ట్రానిక్ ఉపాధ్యాయిని సిల్వియా గ్లోరి, ఆటోమోటివ్ సిబ్బంది సాయిబాబు, చారులత పర్యవేక్షణలో జరిగిన ఇంటర్న్‌షిప్‌లో ప్రాక్టికల్ నైపుణ్యాన్ని పెంపొందించారు. భవిష్యత్తులో ఉపాధికి బాటలు వేసే విధంగా విద్యార్థులకు వృత్తి శిక్షణ ఇచ్చారు. బైక్ షోరూమ్‌లకు తీసుకెళ్లి వాహనాల మరమ్మతుల గురించి వివరించారు. 10రోజులు పాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

● రూ.98లక్షల60వేల నిధులు మంజూరు
● 42మంది లబ్ధిదారులకు చెక్కులు
● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఎవరూ వైద్యఖర్చుల నిమిత్తం అప్పులపాలు కాకుండా ఉండాలనే సం కల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి సకాలంలో నిధులు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్నారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని 42 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 42మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.98లక్షల 52వేల173లు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం బోర్డు సభ్యులు జీవీ నాగేశ్వరరావు, కొలసాని రాము, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అమృతలూరులో 13 మందికి..

అమృతలూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని 11 మంది అనారోగ్యంతో చికిత్స పొందారు. వీరు ఎమ్మెల్యే నక్కా అనందబాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీలు అందజేశారు. కూచిపూడి గ్రామానికి చెందిన రామినేని వసుంధర రూ.41,084, తాళ్ళూరి రామారావు రూ.40 వేలు, రెడ్డి జగదమ్మ రూ.26,168, గోవాడకు చెందిన ఉప్పాల సువర్ణకుమారి రూ.లక్షా 30 వేలు, కొసరాజు శ్రీలత రూ.40,100 ప్యాపర్రు గ్రామానికి చెందిన ఆలపాటి జయప్రద రూ.20,524, తగరం సీతమ్మ రూ.20 వేలు, మోపర్రు గ్రామానికి చెందిన మోపర్తి రాంబాబు, రూ.20 వేలు, యక్కాల రాజ్యం రూ.40,350 పాంచాళవరం గ్రామానికి చెందిన మేకా శ్రీదేవి, రూ.48,365, ఇంటూరుకు చెందిన తన్నీరు పెదమస్తాన్ రూ 43,926, తడికమళ్ళ రమాదేవి రూ 49,300 అమృతలూరుకు చెందిన మండే హర్షవర్ధన్ రూ.24,360 మొత్తం రూ.5లక్షల 44వేల 177లు చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. వీటిని గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, పావులూరి హేమచంద్, వన్నా బెనర్జీ, మేకా రాంబాబు, మట్లపూడి జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారి సన్నిధికి ప్రముఖులు

● ప్రత్యేకపూజల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ల, మాజీ మంత్రి దేవినేని ఉమ


ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో, పక్కన మాజీ మంత్రి దేవినేని ఉమ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మంగళవారం ప్రముఖులు వచ్చారని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి తెలిపారు. ఉదయం శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని తెలిపారు. వారిని సత్కరించి అమ్మవారి చిత్రపటం అందజేశారు. గుంటూరు, తెనాలి రెండో అదనపు మేజిస్ట్రేట్ పి.రాజశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి సీహెచ్.విజయలక్ష్మీ, గ్రామపంచాయతీ కార్యదర్శి బండ్లమూడి సుజాతలు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

2.27లక్షల మందికి పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి : జిల్లా వ్యాప్తంగా 2,27,105మందికి ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 97.73 కోట్ల రూపాయలు పెన్షన్‌లుగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటి వద్దకే వచ్చి పెన్షన్‌లు ఇస్తారు కాబట్టి లబ్ధిదారులు ఇళ్ళ వద్దనే ఉండాలని చెప్పారు. బుధవారం ఉదయం నుంచి పెన్షన్లు ఇస్తారన్నారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందరాదని అధికారులు మీ ఇంటివద్దకే వచ్చి పెన్షన్లు అందజేస్తారన్నారు. బుధవారం పెన్షన్ తీసుకోలేనివారు గురువారం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విజయభాస్కర్‌రెడ్డికి గుర్రం జాషువా సేవారత్న


ఎంపీ రాజుపాలెం హెచ్‌ఎం పి.విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కర్లపాలెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీ రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిట్టు విజయభాస్కర్‌రెడ్డికి మహాకవి గుర్రంజాషువా సేవారత్న అవార్డును మంగళవారం ప్రదానం చేశారు. డాక్టర్ చందోలు నాగమల్లేశ్వరరావు గ్లోబుల్ ఫౌండేషన్ జమైకా గుర్రంజాషువా ట్రస్ట్ రేపల్లె డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహాకవి గుర్రంజాషువా జయంతి వేడుకల్లో హంస జూనియర్ కాలేజిలో జరిగిన వేడుకల్లో విజయభాస్కర్‌రెడ్డికి గుర్రంజాషువా సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. భాస్కర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రకాశంజిల్లా డీఈవో అత్తోట కిరణ్‌కుమార్, సమగ్రశిక్ష పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


వెలగపూడి లే అవుట్లో తీసిన గుంతలో నిలిచిన నీరు

రాజధాని లే అవుట్లు ఇలాగేనా!

- రాజధాని రైతుల్లో పొడ చూపుతున్న ఆగ్రహం
- హడావిడిగా దిద్దుబాటు చర్యలకు దిగిన సీఆర్డీఏ
- వర్షాల్లో, బురదలో లే అవుట్లలో పనులకు శ్రీకారం
- వాహనాల తొక్కిడితో లే అవుట్లలో భూమి ఛిద్రం
- బెడిసి కొడుతున్న దిద్దుబాటు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల లే అవుట్ల విషయంలో కొత్త సమస్య తలెత్తింది. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా తమకు ప్లాట్లు సిద్ధం చేసి ఇవ్వలేదని భూములిచ్చిన రైతులు ఒక్కొక్కరుగా రోడ్డు మీదకు ఎక్కుతుండడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా హడావుడిగా లే అవుట్లు సిద్ధం చేయడానికి అధికారులు కుస్తీలు పడుతున్నారు. అయితే లే అవుట్లలో చేపడుతున్న పనుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో లే అవుట్ల వ్యవహారం పీటముడిలా మారుతోంది.

ఏడాదిన్నరపాటు మీనమేషాలు లెక్కబెట్టారా?

రాజధాని కోసం తాము భూములు త్యాగం చేసి 11 ఏళ్లవుతున్నా ఇంత వరకూ తమకు

● హడావుడిగా పనులు.. గుల్లవుతున్న నేల

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తమకు ప్లాట్లు రాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్న విషయం సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని పురపాలకశాఖ, సీఆర్డీఏకు సూచించారు. దీంతో సీఆర్డీఏ హడావుడిగా వెలగపూడి, లింగాయపాలెం గ్రామాల్లోని లే అవుట్లలో పనులు ప్రారంభించింది. అయితే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల మధ్య భారీ ప్రొక్లెయినర్లతో దిగి కంప చెట్ల తొలగింపుతోపాటు, లే అవుట్లలో అంతర్గత రోడ్లు వేసేందుకు మట్టి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వర్షాల్లో ఈ పనులు చేపట్టడం కారణంగా లే అవుట్లలో మొత్తం నేలంతా గుల్లయిపోతోంది. రోడ్డు వేయడం కోసం రెండడుగుల మేర గుంతలు తీశారు. ఈ గుంతల్లో ఒక పొర కంకర, మరో పొర గులకరాయి వేసి, ఆ తరువాత రోడ్డు వేయాల్సి ఉంటుంది. అయితే ఈ గుంతలు వర్షాకాలంలో తీయడంతో వాటిలో నీరు చేరింది. దీంతో మళ్లీ నీళ్లు తోడుకోవడం పనిగా మారింది. ఇలా అర్థరహితంగా చేపడుతున్న పనుల కారణంగా లే అవుట్లు దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వంపై కూడా భారం పడుతోంది.

● ఏడాదిన్నరపాటు ప్లాట్లు ఇవ్వకుండా ఏం చేస్తున్నారు?

రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వకపోవడమేంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014-19కి ముందే తమకు ఇవ్వాల్సిన ప్లాట్లు ఇచ్చి ఉంటే గత వైసీపీ ప్రభుత్వం తమను వేదనకు గురి చేసేది కాదని రైతులు వాపోతున్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకైనా తమకు ప్లాట్లు వస్తాయని ఆశిస్తే అది ఇప్పటి వరకు నెరవేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అయితే సీఆర్డీఏ అధికారుల నిర్వాకంతో వ్యవహారం మొత్తం బెడిసి కొడుతోంది.

● ఈ దఫా అయినా వచ్చేనా..!

ఇదిలా ఉంటే రాజధాని రైతులకు ప్లాట్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం రైతుల్లో భయాందోళనలకు దారితీస్తోంది. ఈ దఫా అయినా తమకు ప్లాట్లు ఇస్తారో లేదోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్లాట్లు సకాలంలో ఇచ్చి ఉంటే రాజధానిలో ప్రభుత్వ భవనాలతోపాటు, ప్రైవేటు భవనాల నిర్మాణం కూడా సమాంతరంగా సాగుతుందని, అది రాజధాని సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్లాట్లను సరైన రీతిలో సిద్ధం చేసి తమకు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పంచాయతీల్లో అక్రమాలకు చెక్..!

- దొంగబిల్లులతో ఖజానా ఖాళీకి అడ్డుకట్టు
- స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా పాలన కొనసాగింపు

వినుకొండటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నులతో పాటు ప్రతి పైసాకు జమా ఖర్చులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగిస్తోంది. పంచాయతీ పాలన పారదర్శకంగా ఉండేందుకు నూతనంగా స్వర్ణ పంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిధుల వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ యాప్ సత్ఫలితాలను ఇస్తుంది. ఇక నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చులు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 13,344 గ్రామపంచా యతీల్లో ఈ యాప్ ద్వారా పారదర్శక పాలన అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. పల్లెల్లో ప్రజలు నివాస గృహాల, ఇతర గృహాల, తాగునీటి పన్నులను సరిగా చెల్లించేవారు కాదు. చెల్లించిన నగదుకు లెక్కలు ఉండేవి కాదు. అందిన కాడికి దోచుకునే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. గుండుసూది మొదలుకొని పారకల కొనుగోలు వరకు జమా ఖర్చులకు ప్రతిపైసా పారదర్శకంగా ఉండేలా స్వర్ణపంచాయతీ విధానం తీసుకొచ్చింది.



● 'స్వర్ణ పంచాయతీ'తో ఉపయోగాలు

స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులోకి వస్తే ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా పన్నులన్నీ డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. ఇంటి పన్నుల చెల్లింపులు, బాకీలను డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. డబ్బు నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. అలాగే పంచాయతీలు ఖర్చు చేసే ప్రతిపైసా వివరాలు పారదర్శకంగా ఉంటాయి. ఈ యాప్ అందుబాటులోకి వస్తే కార్యదర్శులు లెక్కలు చెప్పాల్సిందే. కొనుగోళ్లను యాప్ ద్వారా నమోదు చేయాలి. దొంగబిల్లుల చెల్లింపులు అరికట్టవచ్చు. ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదు కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. గ్రామీణ ప్రజలు ఇంటి నుంచి సేవలు పొందవచ్చు. రశీదు, లావాదేవీల వివరాలు ఎప్పుడైన చూసుకోవచ్చు. స్వర్ణ పం చాయతీ యాప్ డిజిటల్ రికార్డులను సులభతరం చేస్తుంది.



బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

- ఘనంగా బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సరిహద్దు మండలాల్లో కోలాహలం

దాచేపల్లి/దుర్గి సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు విడిపోయినా ప్రజల మధ్య ఉన్న ఆచారాలు, సాంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బతుకమ్మ అంటే గుర్తు వచ్చేది తెలంగాణ రాష్ట్రం. తెలంగాణకు సరిహద్దు మండలం దాచేపల్లిలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. మహిళలు బతుకమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. తెలంగా ణకు చెందిన ఆడ పిల్లలను ఈ ప్రాంత వాసులకు ఇచ్చి పుచ్చుకోవడం సంవత్సరాల తరబడి జరుగు తుంది.అప్పటి నుంచే ఈ ప్రాంతంలో బతుకమ్మను దేవీ నవరాత్రుల్లో భాగంగా చేసి పూజలు చేస్తారు.

ఏడు కోటలతో వెంపలి చెట్టుకు

పుట్ట మన్నుతో నాగ పడిగ ఆకారంలో ఏడు కోటలను నిర్మించి అందులో వెంపలి చెట్టును ఉంచుతారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి రోజుకొక పిండి వంటలను తయారు చేసి నివేదన చేస్తారు. పెళ్లికాని ఆడ పిల్లలు, సం తానం లేని వారు, సౌభాగ్యం కోరుకొనే మహి ళలు అమ్మవారికి ఈ పది రోజుల పాటు పూజ లు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారు. వాడవాడలా చిన్నారులు బతుకమ్మను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుంది. దసరా పండుగ రోజు పది రోజుల పాటు పూజలందుకున్న బతుకమ్మను గ్రామానికి సమీపంలో ఉన్న వాగులు, చెరువులు, కుంటలో నిమజ్జనం చేస్తారు. ఈ నిమజ్జన కార్యక్రమానికి మహిళలంతా పెళ్ళి కుమార్తెను అత్తవారింటికి పంపించేటప్పుడు సారె ఇచ్చినట్లు.. చీర, చలిపిండి, పూలు, గాజులు, పండ్లు బతుకమ్మకు అందజేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు. ఈ పది రోజుల పాటు ఈ ప్రాంతంలో కోలాహలంగా ఉంటుంది. మహి ళలంతా ఒక యూనిట్‌గా ఏర్పడి వీధుల్లోనే బతుకమ్మను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. మగవారు ఈ పూజా కార్యక్రమాలకు తమ వం తుగా సహకరించి అమ్మవారికి కృపకు పాత్రు లవుతుంటారు. తెలంగాణ పద్ధతిలోనే బతక మ్మను పలురకాల పూలతో అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పల్లె పల్లెన బతుకమ్మ సంబరాలు..

దసరా పండుగ వచ్చింది.. వస్తూనే బతుకమ్మ సంబరాలను తెచ్చింది. నిన్నా మొన్నటి వరకు పట్టణాలకే పరిమితమైన బతుకమ్మ ప్రస్తుతం పల్లెలోనూ సందడి చేస్తోంది. మండల కేంద్రమైన దుర్గితోపాటు ఓబులేశునిపల్లె, అడిగొప్పుల, ముటుకూరు, ధర్మవరం వంటి పల్లెల్లో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను చేసి ఊరేగిస్తున్నారు. చిన్నారులు, యువతులు కోలాటాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికం, సాంప్రదాయ మేళవింపుగా దుర్గి మండల పరిధిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బతుకమ్మలను పురవీధుల్లో ఊరేగించి దేవాలయాల్లో కొలువుదీరుస్తున్నారు. దేవీ శరన్నవరాత్రులు ముగింపు రోజున బతుకమ్మలను కుడికాలవలో వదలనున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్థులు ఐకమత్యంతో బతుకమ్మ ఊరేగింపులో పాల్గొంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు.


దుర్గిలో బతుకమ్మ ఊరేగింపు ముందు చిన్నారుల కోలాటం

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

చిత్రజ్యోతి
SINCE 1965

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

(3వ పేజీ తరువాయి)

విడుదలైన జాతీయస్థాయి విశ్వ విద్యాలయాల ర్యాంకుల్లో కూడా ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అట్టడుగు స్థాయికి చేరింది. లబ్ద ప్రతిష్ఠులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు యూనివర్సిటీలో చాలా మంది ఉన్నప్పటికీ పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ముందరి కాళ్లకు బంధనాలువేస్తున్న పరిస్థితి అక్కడ నెలకొన్నట్లు తెలుస్తోంది.

చెల్లని నిర్ణయాలు

వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ పొందిన కొందరు శాస్త్రవేత్తలు ఈ మధ్య కాలం లో సీఎంఓలో ఒక ఫిర్యాదు అందజేశారు. కోరం లేకుండా తీసుకున్న ప్రతి నిర్ణయం చట్ట విరుద్ధమని, వాటి పై సమీక్ష నిర్వహించాలని అందులో కోరారు. ఐదుగురు సభ్యులతో మాత్రమే నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు, రూ.1.25 కోట్లతో కార్ల కొనుగోలు వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. అవి చెల్లుబాటు కావన్నది విశ్రాంత శాస్త్రవేత్తల వాదన.

పాలక మండలి సభ్యులు ఉన్నా

గత ప్రభుత్వం వ్యవసాయ విశ్వ విద్యాలయానికి పాలక వర్గం నియమించింది. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామా చేశారు. ముగ్గురు మాత్రం ఈ రోజుకీ రాజీనామా చేయలేదు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేస్తే. రిజిస్ట్రార్ వారికి తగిన సమాచారం ఇవ్వాలి. కానీ ఒక్క సమావేశానికి కూడా వారికి ఆహ్వానం పంపలేదని తెలుస్తోంది.

నేడు డ్రోన్ పైలెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా డ్రోన్‌శిక్షణా కేంద్రం

ఇంకొల్లు,సెప్టెంబరు 30,(ఆంధ్రజ్యోతి) : భారత పౌరవిమానయానశాఖ అనుమతితో డ్రాన్‌ల్యాబ్ టెక్నాలజీస్, అహ్మదాబాద్, మారుతి ఐటిఐ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇంకొల్లులో బుధవారం సాయంత్రం 4 గంటలకు డ్రోన్ శిక్షణా కేంద్రాన్ని (రిమోట్ పైలట్ ట్రేనింగ్ ఆర్గనైజేషన్) ప్రారంభించనున్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు మారుతీ ఐటిఐ ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. అన్నదాత మణి, ఆంధ్రరాష్ట్ర ఉపాధి, శిక్షణాశాఖ జేడీఏ ఎస్.సత్యనారాయణ, ఆర్‌డిఏ నాగవర్ధనరాజులు కార్యక్రమానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

మహాపాపం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చినగంజాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో తిరుమల తిరుపతిలో జరిగిన మహా అపచారానికి నిరసనగా మంగళవారం టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మహాపాపం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, కొండ్రగుంట శ్రీహరి, సందు శ్రీనివాసరావు, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, ధర్మవరపు ఏసునారయణ, ఎం.సత్యనారాయణ, షేక్ జిలాని, మాచవరపు రామాంజనేయులు, జి.నరసింహారావు, ఎం.లక్ష్మయ్య, ధనరాజ్, రామాంజనేయులురెడ్డి, ఉదయ్‌భాస్కరరెడ్డిలు పాల్గొన్నారు.

మలిసంధ్యలో మరో మజిలీకి

- ఆశ్రమాల్లోనే పండుటాకులకు ఆదరణ
- ఏటా పెరుగుతున్న నిస్సహాయ వృద్ధుల సంఖ్య
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

చీరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మనిషి జీవితంలో బాల్యం, యవ్వనం, నడివయస్సు, తర్వాత వృద్ధాప్యం ఇలా ఒక్కో మజిలీలో ఒక్కో అనుభవాన్ని , ఒక్కో భావోద్వేగాన్ని తమలో ఇముడ్చుకుంటూ చివరి మజిలీవైపు సాగుతుంటారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో ఉన్న వారికి, తమవారు అనుకున్న వారి పలకరింపులే కొండత ధైర్యాన్ని ఇస్తాయి. అయితే నేటి ఆధునికయుగంలో మనుషులు యాంత్రిక జీవనంలో తలమునకలవుతున్నారు. సంపాదనే లక్ష్యంగా దేశ, విదేశాలకు పరుగులు తీస్తున్నారు. కనీ,పెంచిన తల్లిదండ్రులకు దూరమవుతున్నారు. దీంతో బంధాలు, బంధుత్వాలు ఎండమావుల వలే అలా ఊహల్లోనే ఉంటున్నాయి. వయోభారంలో ఉన్న తల్లిదండ్రులకు వృద్ధాశ్రమాలే మరోమజిలీగా మిగులుతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతోంది. అనాథల్లా ఉన్న వృద్ధులకు ఆశ్రమాలు నీడ నివ్వడం ఒకింత మంచిదే అయినా, అందరూ ఉండి ఆశ్రమాల్లో చేర్చడం బాధాకరమని విశ్లేషకులు అంటున్నారు.

ఆశ్రమాల్లోనూ సాంత్వన

అయితే కుటుంబ సభ్యులకు భారమో లేక తప్పకో ఆశ్రమాల్లో చేరిన వారికి ఇక్కడ కొంతమేరకు సాంత్వన ఉంటుందనే చెప్పాలి. విధి వారిని ఆశ్రమాలకు పరిమితం చేస్తుంటే నిర్వాహకులు వారికి కల్పించే ఆదరణ, అంతా ఒకరి బాధలు ఒకరికి చెప్పుకుని దగ్గరవుతున్నారు. ఈ క్రమంలోనే అందరూ కలిసి భోజనం చేయడం, మంచిగా ముచ్చట్లు చెప్పుకుంటూ, ఆ పాత మధురాలు చిత్రాలను టీవీల ద్వారా వీక్షిస్తు ఆనందిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబాలకు దూర మైన వారికి ఆశ్రమాలు ఉపయోగకరమనే చెప్పాలి. చీరాల పరిధిలో సుమారు 5 ఆశ్రమాలు ఉండగా అన్నింట్లో కలుపుకుని సుమారు 300 మంది వరకు వృద్ధులు కాలాన్ని గడుపుతున్నారు. వీరిలో కొందరు కుటుంబం సభ్యుల నుండి నెలవారీ రుసుము, మరి కొందరు దాతల సహకారంతో కాలాన్ని గడుపుతున్నారు.



వృద్ధాశ్రమంలోని వృద్ధులు

ఒంటరిగా ఉండలేక...



భర్త సుమారు 25 సంవత్సరముల క్రితం మృతిచెందారు. ముగ్గురు సంతానం. వారికి పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం నా ఆలనా పాలనా చూసే వారు లేక ఆశ్రమంలో ఉంటున్నాను. ఇక్కడ అందరితో ఆనందంగా ఉంది. అయితే కుటుంబ సభ్యులు తీసుకువెళితే ఇంటికి వెళ్లాలని ఉంది.

- అవ్వారు కోటేశ్వరమ్మ, చీరాల

చూసేవాళ్లు లేక : సజ్జా నాగేశ్వరరావు, వేటపాలెం



ఒకప్పుడు బాగా బతికాను. ఇద్దరు కుమారులు విధి రాతతో చనిపోయారు. భార్యతో వయోప్రాయం కారణంగా ఇబ్బందులు పడ్డాను. దీంతో బంధువులు ఆమెను ఒకచోట, నన్నొక చోట ఆశ్రమాల్లో చేర్పించారు. ఇక్కడ చాలా బాగా చూస్తున్నారు. కుటుంబంలో పరిస్థితి లేకపోయిన ఆశ్రమం ఆనందాన్నిచ్చింది.

దాతల సహకారంతో 30 ఏళ్లుగా నిర్వహణ



వయోభారంలోలో ఉన్నవారికి సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాను. దాదాపుగా 30 ఏళ్ల క్రితం మా నాన్న చేజెర్ల కోటయ్య స్థాపించిన నాటి నుంచి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాము. కొంత మంది కుటుంబ సభ్యుల నుంచి కొంత సహకారం ఉంటుంది. అలాగే దాతలు సహకారంతోనూ చక్కగా నిర్వర్తిస్తున్నాం. ఇతర జిల్లాల నుండి కూడా వచ్చి ఇక్కడ చేరుతున్నారు. ఎవరికైనా సేవలు కావాల్సి ఉంటే 90594 03603 సంప్రదించవచ్చు.

- పునీత్‌కుమార్, ఆశ్రమ నిర్వాహకుడు

రహదారి మరమ్మతులు చేయాలని నిరసన

- గ్రానైట్ లారీలను అడ్డగింత



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బల్లికురవ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డును బాగు చేశాకే లారీ లు తిప్పాలని నక్కబొక్కలపాడు గ్రామస్థులు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని బల్లికువ - మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వాన స్థితికి చేరి దుమ్ము ధూళి వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని నక్కబొక్కలపాడు గ్రామస్థులు మంగళవారం రాత్రి గ్రానైట్ లారీలను అడ్డుకున్నారు. ఎంతో కాలం నుంచి ఈ రోడ్డుపై మోకాటి లోతు గుంతలు పడి అధ్వానంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు నక్కబొక్కలపాడు గ్రామం మీదుగా వెళ్తుండడంతో దుమ్ము అధికంగా వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్థులు గ్రానైట్ లారీలను నిలుపుదల చేసి ధర్నాకు దిగారు. దీంతో పెద్ద ఎత్తున గ్రానైట్ వాహనాలు నిలిచిపోయాయి.

అమ్మ ఆశీస్సులు ప్రజలకు అందాలి

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

చీరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి ఆశీస్సులు నియోజక వర్గంలోని ప్రజలకు అందాలని, రైతులకు సాగు సక్రమంగా జరగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. దసరా దేవీ నవరాత్రులు సందర్భంగా 300 కాలనీ, పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మ వారిని విశేష అలంకరణలతో అలంకరించి పూజలు చేశారు. అంతకుముందు కార్యక్రమానికి హాజరయిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అన్నసంతర్పణలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగజ్జనని పాలయమాం

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు విశేష పూజలందుకుంటున్నారు. వివిధ ఆలయా ల్లో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

-పంగులూరు, బల్లికురవ, పర్చూరు, చినగంజాం, అద్దంకి







రేణంగివరం త్రిశక్తిపీఠంలో దుర్గాదేవి అలంకరణ, నక్కబొక్కలపాడులో దుర్గా దేవిగా పోలేరమ్మ తల్లి, పర్చూరులో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు, నాగరాజుపల్లిలో దుర్గాదేవి అలంకారంలో అ మ్మ వారు, అద్దంకిలో కన్యకా పరమేశ్వరికి విశేష అలంకరణ

శుభ్రపడుతున్న డంపింగ్ యార్డు

● వ్యర్థాలను నాలుగు రకాలుగా విభజన ● రైతులకు మేలు చేసేలా సేంద్రియ ఎరువు తయారీ


డంపింగ్ యార్డులో వ్యర్థాను శుద్ధిచేసిన తరువాత వచ్చే ఎరువును లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్, చెత్తను శుద్ధి చేస్తున్న యంత్రం

అద్దంకి, సెప్టెంబర్30(ఆంధ్రజ్యోతి): అద్దంకి కొండ వద్ద టిడ్కో ఇళ్ల సమీపంలోని డంపింగ్ యార్డు వైపు వెళ్లాలంటే ఇటీవల వరకు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో టిడ్కో ఇళ్లు పూర్తయినా, అక్కడ నివాసం ఉండేందుకు లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తీసుకున్న నిర్ణయం తో డంపింగ్ యార్డు స్థానంలో పార్కు అందుబాటులోకి రానుంది. గత దశాబ కాలంగా అద్దంకి పట్టణంలో సేకరించిన చెత్త మొత్తం అద్దంకి కొండకు తూర్పు వైపున సుమారు 4 ఎకరాలు డంపింగ్ యార్డుగా మార్చారు. డంపింగ్ యార్డులో ఉన్న సుమారు 58 వేల మెట్రిక్ టన్నుల చెత్తను చిలకలూరిపేట కు చెందిన తరుణి స్వచ్ఛంద సంస్థ స్క్రీనింగ్ ద్వారా 4 రకాలుగా విభజిస్తోంది. స్కీనింగ్ ద్వారా వచ్చే ఘన వ్యర్థాలు, రాళ్లు, అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని గుంతను పూడ్చుతున్నారు. ఎరువును తరుణి స్వచ్ఛంధ సంస్థ రైతులకు అందజేయనుంది.. కాగితాలు, పాత దుస్తులను జిందాల్ సంస్థకు తరలిస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను కాల్చివేయనున్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలు అత్యధిక శాతం తొలగించే విధంగా చేస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగింపు చేపట్టిన తరువాత ఆ ప్రాంతాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేయనున్నారు. సాధారణంగా డంపింగ్ యార్డుగా వినియోగించిన ప్రాంతంలో 15 సంవత్సరాల పాటు ఎలాంటి కట్టడాలు నిర్మాణం చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అద్దంకి కొండ వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతం కొండ ప్రాంతం కావడంతో నేల గట్టితనంగా ఉండే అవకాశం ఉంది. దీంతో కొద్ది సంవత్సరాల తరువాత మున్సిపల్ అవసరాలకు, ఇళ్ల స్థలాల కోసం వినియోగించే అవకాశం ఉంది. దీంతో సుమారు 4 ఎకరాల భూమి మున్సిపాలిటికి చెందనుంది. అయితే ప్రస్తుతం అద్దంకి పట్టణంలో ప్రతి రోజు 19 టన్నులు చెత్త సేకరణ జరుగుతుండగా 10 టన్నులు మాత్రం ప్రతిరోజు నేరుగా గుంటూరులోని జిందాల్‌కు తరలిస్తున్నారు. మిగిలిన 9 టన్నులలో 1.5 టన్ను వరకు ఎరువుగా మారుతుంది. మిగిలిన చెత్తను ఏవిధంగా వినియోగించాలన్న విషయంపై పై ఉన్నతస్థాయి అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డంపింగ్ యార్డు శుభ్రం అవుతుండటంతో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత లబ్ధిదారులకు దుర్వాసన వచ్చే అవకాశం తప్పింది.

అవీ..ఇవీ..

పేరుమారని విలేజ్ క్లీనిక్..!



భవనంపై ఉన్న వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరు

అద్దంకి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగరకొండ పాలెంలోని విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనంపై ఉన్న పేరును చూస్తే ఇంకా వైసీపీ పాలనలోనే ఉన్నామన్న భావన కలగక మానదు. వైసీపీ హయాంలో ఇష్టానుసారం వారు పేర్లు మార్చుకున్నారు. ఏడాదిన్నర క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పేర్లను మార్చింది. ఈ క్రమంలో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పేర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ గా మార్పు చేశారు. అయితే నేటికీ శింగరకొండపాలెంలోని హెల్త్ క్లీనిక్‌పై పేరు మారలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాలలో భవనాలపై ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంటి ముందు ఉంచిన బైకు చోరీ

● కొమ్మినేనివారిపాలెంలో మాయం ● గుంటూరులో స్వాధీనం

బల్లికురవ, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేని వారిపాలెంలో ఇంటి ముందు ఉంచిన బైకును సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. అందిన సమాచారం మేరకు కొమ్మినేవారిపాలెం గ్రామానికి చెందిన మల్లిపెద్ది నాగులుమీరా అనే రైతు తన బైకును ఇంటి ముందు ఉంచి ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు బైకును చోరీ చేశారు. మంగళవారం ఉదయం నిద్ర లేవగానే బైకు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ చోరీ చేసిన బైకు గుంటూరులో పట్టుబడినట్లు తెలిసింది.

వెంపరాలలో పారిశుధ్య పనులు

● జ్వరపీడితుల వివరాలకు ఇంటింటి సర్వే
● నేడు వైద్య శిబిరం


జ్వరపీడితుల వివరాలు తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

అద్దంకి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో పారిశుధ్య పనులు, జ్వరపీడితుల వివరాల సేకరణకు ఇంటింటి సర్వే చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ సర్పంచ్ వెంకాయమ్మ పౌల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు మురుగుకాల్వలలో నిలిచిన మురుగు నీరు పారుదలకు వీలుగా పూడికతీత పనులు చేయించారు. సైడ్ డ్రైన్‌లు, మురుగు నిలబడే ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించారు. మోదేపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సత్తార్, పీహెచ్ఎన్ కన్యాకుమారిల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరపీడితుల వివరాలను సేకరించారు. జ్వరాలతో పలువురు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బుధవారం వెంపరాలలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు తెలిపారు.

ఉత్సాహభరితంగా సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు

గ్రామీణ క్రీడ ఖోఖోను ఆదరించాలి
అసోసియేషన్ ఉపాధ్యక్షులు గురుప్రసాద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుప్రసాద్, పోటీపడుతున్న జట్లు

పంగులూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నిర్వహిస్తున్న సూపర్‌లీగ్ ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఎంఎస్ఆర్అండ్ బీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఖోఖో పోటీలను సౌత్‌జోన్ ఖోఖో అసోషియేషన్ ఉపాధ్యక్షులు కె.గురుప్రసాద్, నెల్లూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాచినేని గిరిప్రసాద్, సతీష్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణక్రీడ ఖోఖోను ప్రజలు ఆదరించాలన్నారు. సూపర్ లీగ్ పోటీలు క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి దోహద పడతాయన్నారు. పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడలలో రాణించిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, ఉపాధి అవకాశాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అకాడమి డైరక్టర్ ఎం సీతారామిరెడ్డి, పలువురు పీడీలు, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూపర్‌లీగ్‌లో సత్తా చాటుతున్న క్రీడాజట్లు

ఉత్సాహభరితంగా మంగళవారం జరిగిన ఖోఖోలీగ్ పోటీలలో ఫైర్‌కింగ్స్‌పై డైవింగ్ డీర్స్, వైల్డ్ వారియర్స్‌పై రైజింగ్ ఈగల్స్ విజయం సాధించగా, డైనమిక్ డ్రాగన్స్‌పై ఐరన్‌బూల్స్, డైవింగ్ డీర్స్‌పై వైల్డ్ వారియర్స్ విజయం సాధించారు. సోమవారం రాత్రి వర్షం కారణంగా పోటీలు నిలిచిపోవడంతో బుధవారం పోటీలను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిబద్ధత కలిగిన మహోన్నత వ్యక్తి హనుమంతరావు

అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య


సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంచుగరటయ్య

ఇంకొల్లు,సెప్టెంబరు 30, (ఆంధ్రజ్యోతి) : మంచి వ్యక్తి త్వం, నియమ నిబద్ధత ఉన్న మహోన్నత వ్యక్తి మద్దినేని హనుమంతరావు అని అద్దంకి మాజీ శాసనసభ్యులు బాచిన చెంచుగరటయ్య అన్నారు. ఇటీవల మృతి చెందిన మద్దినేని హనుమంతరావు సంస్మరణ సభ మంగళవారం ఇంకొల్లు రోటరీ గంగ ఆవరణలో డాక్టర్ బీరం సుందరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గరటయ్య మాట్లాడుతూ ఉత్తమ ప్రజా సేవకుడిగా ఇంకొల్లు ప్రాంతంలో హనుమంత రావు పేరుపొందారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా, ఎంపీపీగా, రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ఇంకొల్లు ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చేసిన సేవలను కొనియాడాలరు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వీరగంధం ఆంజనేయులు, కుర్రా హనుమంతరావు, భవనం శ్రీనివాసరావు, జడ్పీటీసి భవనం శ్రీలక్ష్మీ, రావి అంకమ్మ, రవీంద్రారెడ్డి, రావి సత్యనారాయణ, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి మాజీ ఎంపీ జెడీ శీలం హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ రిసార్ట్స్ వివాదం

● గతంలో ఒక నిర్మాణానికి నోటీసులు
● తాజాగా మరొకటి ప్రారంభం
● ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు


తీరాన్ని చదును చేసి పార్కింగ్ వినియోగం(ఫైల్)

రామాపురం(చీరాల), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతాల్లో అక్రమ రిసార్ట్ నిర్వహణ తారాస్థాయికి చేరుతోంది. సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నిబంధనలకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా భవనాలు నిర్మించి జేబులు నింపుకుంటున్నారు. అంతేకాకుండా సముద్రతీరానికి రక్షణ కవచంలా ఉన్న ఇసుక దిబ్బలు సైతం కూల్చి చదును చేసుకొని రిసార్ట్‌కు పార్కింగ్‌లుగా వినియోగించుకుంటున్నారు. ఇదిలా ఉంటే అసైన్డ్ భూమిలో అక్రమ రిసార్ట్ నిర్మించారంటూ రెవెన్యూ అధికారులు తీరంలోని గ్రాండ్ ఆర్య బీచ్ రిసార్ట్‌కు నోటీసులు అందించారు. దీనిపై ప్రస్తుతం అధికారులకు, నిర్వాహకులకు మధ్య వివాదం నెలకొంది. అయితే తాజాగా వెనుక భాగంలోని కారంచేడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన సర్వే నెం.427/3-34లో ఇదే నిర్వాహకులు కన్‌స్ట్రక్షన్ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈక్రమంలోనే మంగళవారం ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పూర్తిస్థాయిలో రెండింటిపై చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండప ప్రారంభోత్సవం

● కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సిద్ధమైన టీటీడీ కల్యాణ మండపం

నూతలపాడు (పర్చూరు), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో రూ.3.5 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్మించిన టీటీడీ కళ్యాణ మండప ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వహకులు మంగళవారం తెలిపారు. ప్రారంభకులుగా స్థానిక శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు హాజరుకానున్నారు. ముఖ్య అతిథులుగా దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, బాపట్ల ఇన్‌చార్జి మంత్రి వర్యులు కొలుసు పార్థసారధి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొంటారన్నారు.

ఫ్రాన్స్ పర్యటనకు మంత్రి గొట్టిపాటి



అద్దంకి, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): అధికారుల బృందంతో కలిసి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఫ్రాన్స్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. నవంబరు 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ అధికారుల బృందంతో కలిసి వెళ్లారు. ఫ్రాన్స్‌లో 4 రోజులపాటు అక్కడే ఉండి అధికారిక కార్యక్రమాలలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలను రవికుమార్ కలవనున్నారు. అనంతరం మరో రెండు, మూడు రోజులు వ్యక్తిగత పనులను నేపథ్యంలో అక్కడే ఉండే అవకాశం ఉంది. సుమారు వారంరోజుల పాటు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫ్రాన్స్ లో ఉండనున్నారు. అక్టోబరు 6న తిరిగి వచ్చే అవకాశం ఉంది.

వైసీపీ నేతలకు మాజీ మంత్రి పరామర్శ

మార్టూరు,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి మేరువ నాగార్జున మంగళవారం సాయంత్రం మండలంలోని డేగరమూడి గ్రామంలో ప్రమోదకుమార్, జ్యోతి పోతులూరిలను పరామర్శించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయాలనుకున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 రోజులలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేయాలని, లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట భవనం శ్రీనివాసరెడ్డి, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు


బ్యూటీషన్ కోర్సులో మెళుకువలను వివరిస్తున్న ట్రైనీ దివ్యతేజ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఒకేషనల్ నైపుణ్యాభివృద్ధి కోర్సును అందిస్తున్నట్లు హెచ్‌ఎం కే.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విద్యార్థినులకు బ్యూటీషన్‌పై ట్రైనీ జి.దివ్యతేజ మెళకులను, అవగాహన కల్పించారు. దసరా సెలవుల నేపథ్యంలో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధాన మురుగుకాలువలో పూడికతీత


ప్రధాన కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

ఇంకొల్లు, సెప్టెంబరు 30,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయితీ పరిధిలోని ప్రధాన మురుగుకాల్వలలో పూడికతీత పనులు చేపట్టారు. గొల్లపాలెం రోడ్డులోని ప్రధాన మురుగు కాల్వలో పూడికను ఎక్స్‌కవేటర్ సహాయంతో రెండు రోజులుగా తొలగిస్తున్నారు. బాలికోన్నత పాఠశాల నుంచి శివబ్రహ్మకాలనీ చివరి వరకు మురుగు పూడికను తొలగిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన మురుగుకాల్వల పూడికను తీసి అభివృద్ధి చేయనున్నట్లు కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగుకాల్వల్లో వేయరాదన్నారు. దోమలువృద్ధి చెందకుండా ఫాగింగ్ చేసి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆయుర్వేద మందులను వినియోగించుకోవాలి


మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

మార్టూరు, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులను సక్రమంగా వినియోగించుకుంటే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బయట పడతారని వైద్యాధికారి జి.అంజమ్మ అన్నారు. 'స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్' క్యాంప్‌లో భాగంగా మంగళవారం మార్టూరులోని కమ్యూనిటి హెల్త్ సెంటరు వారి ఆధ్వర్యంలో స్థానికంగా అమ్మ ఆశ్రమంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు,పేదలకు వివిధ వ్యాధులకు సంబంధించి ఆయుర్వేద మందులను వైద్యాధికారి పంపిణీ చేశారు. దాదాపుగా 45 మందికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంపౌండర్ తనూజ, ఎస్‌కే ఖాజా బి, ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో ఇంద్రధనుస్సు కనువిందు

● ఆసక్తిగా తిలకించిన ప్రజానీకం


ఆకాశంలో కనువిందు చేస్తున్న ఇంద్రధనుస్సు

మార్టూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగురంగులతో ఇంద్రధనుస్సు మంగళవారం సాయంత్రం మార్టూరులో ఆకాశంలో కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఏడురంగుల ఇంద్రధనుస్సు ఏమోగాని మూడురంగులైన ఎరుపు, లేతపసుపు, నీలం రంగులతో ఇంద్రధనుస్సు కనిపించింది. అంతేగాకుండా ఈ ఇంద్రధనుస్సుపై భాగంలో మరో ఇంద్రధనుస్సు కూడా కనిపించింది. దీంతో రెండు ఇంద్రధనుస్సులు కనిపించాయని ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. ఆకాశంలో తూర్పుదిక్కున కనిపించడంతో కొంతమంది ప్రజానీకం వర్షాలు పడవని, కాదు వర్షాలు బాగా పడతాయని మరి కొంతమంది ప్రజానీకం ఆసక్తిగా చర్చించుకున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

అద్దంకి, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్‌కుమార్(22) చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన పి.అనిల్‌కుమార్ మరోవ్యక్తితో కలిసి మోటార్‌సైకిల్‌పై పదిరోజుల క్రితం అద్దంకి వస్తూ చక్రాయపాలెం సమీపంలో అదుపు తప్పి పడిపోయారు. అనిల్‌కుమార్ ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

చినగంజాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో కె.ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ ప థకం ద్వారా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఈ నెల 21 నుంచి 29వ తేది వరకు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.